పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి : కలెక్టర్

పార్వతీపురం : పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి అన్నారు. వర్షాలు అధికంగా పడడంతో సీజనల్ వ్యాధులు ప్రబల అవకాశం ఉందని శనివారం సంబంధిత అధికారులతో టెలికాన్ఫెరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడా గుంతల్లో నీటినిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని, అన్ని పంచాయతీల్లో తహహశీల్దార్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తహశీల్దార్ ధ్రువీకరించాలన్నారు. ఎక్కడైనా పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు కాకపోతే డిప్యూటీ ఎంపిడిఒలే బాధ్యత అన్నారు. అన్ని పంచాయతీల్లో తాగునీరు క్లోరినేషన్ చేయాల్సిదింగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఆదేశించారు. ఎక్కడైనా తాగునీరు కలుషితమైతే సంబంధిత నివేదికలు అందజేసి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, క్లోరినేషన్ చేసిన ప్రతి ఫోటో డిప్యూటీ ఎంపిడిఒలు సేకరించి సంబంధిత మండల తహశీల్దార్‌కు అందజేయాలన్నారు.

గురుకులంలో కలకలం

- 85 మంది విద్యార్థినులకు పచ్చకామెర్లు
- 28 మందిని విశాఖ కెజిహెచ్‌కు తరలింపు
- వారం రోజుల్లో ఇద్దరు విద్యార్థినులు మృతి
- కలుషిత నీరే కారణం : గురుకులాల ప్రధాన కార్యదర్శి
- ఆస్పత్రిలో విద్యార్థినులకు సబ్ కలెక్టర్ పరామర్శ

ప్రజాశక్తి-కురుపాం

స్థానిక ఎపి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో కలకలం రేగింది. వారం రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం, మరో 85 మంది విద్యార్థులకు పచ్చకామెర్లుతో బాధపడుతున్నట్లు నిర్ధారణ కావడంతో విద్యార్థుల్లోను, తల్లిదండ్రుల్లోను, అధికారుల్లోను అలజడి నెలకొంది. ఇప్పటికే గతనెల 26న పదో తరగతి విద్యార్థిని పువ్వల అంజలి (15) తన ఇంటి వద్ద, ఈనెల 1న తొమ్మిదో తరగతి విద్యార్థిని తోయిక కల్పన పచ్చకామెర్లు బారిన పడి విశాఖ కెజిహెచ్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. అప్రమత్తమైన అధికారులు దసరా సెలవుల్లో ఇంటి వద్ద ఉన్న విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా తీశారు. అందరినీ పాఠశాలకు పిలిపించి శుక్ర, శనివారాల్లో వైద్య పరీక్షలు చేశారు. 85 మందికి పచ్చకామెర్లు ఉన్నట్లు తేలడంతో ఒక్కసారిగా అందరిలోనూ ఆందోళన నెలకొంది. మరికొందరి రిపోర్టులు ఇంకా రావాల్సి ఉంది. తీవ్రత ఎక్కువగా ఉన్న 28 మంది విద్యార్థినులను విశాఖ కెజిహెచ్‌కు తరలించగా, 57 మంది పార్వతీపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న గురుకుల సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.గౌతమి శనివారం పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల అనారోగ్యానికి కారణం కలుషిత నీరేనని ప్రాథమికంగా నిర్ధారించారు. మరోవైపు పాఠశాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురుకులంలో సౌకర్యాలు మెరుగుపర్చాలని ఆదివాసి గిరిజనసంఘం ఆధ్వర్యాన పాఠశాల వద్ద ధర్నా కూడా చేపట్టారు. ఈనేపథ్యంలోనే అధికారులు స్పందించి వైద్య పరీక్షలు చేపట్టారు.

కలుషిత తాగునీటి సమస్యే విద్యార్థులకు పచ్చకామర్ల వ్యాప్తి

కలుషి తాగునీటి సమస్య వల్ల విద్యార్థులకు పచ్చకామర్ల వ్యాప్తి చెందిందని గురుకుల సెక్రటరీ ఎం.గౌతమి అన్నారు. శనివారం స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న విద్యార్థులకు తరగతి గదులు, కిచెన్, డైనింగ్ గాలు, మినరల్ వాటర్ ప్లాంట్, పాఠశాల పరిసర ప్రాంతాలను క్షుణంగా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మిగతా విద్యార్థులకు వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ అదనపు మరుగుదొడ్ల, తరగతి గదులు నిర్మిస్తామని, వంట గది మరుగుదొడ్లు తక్షణమే పరిశుభ్రపరచాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించామని తెలిపారు. మొత్తం 85 మంది విద్యార్థులు పచ్చకామర్లు వ్యాధి బారినపడగా ముందస్తు చర్యలు భాగంగా 22 మంది విద్యార్థులకు కెజిహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నామన్నని, మిగిలిన 63మంది విద్యార్థులు కూడా జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. కొద్దిరోజులు వారి ఆరోగ్యంపై పర్యవేక్షణ చేసి ఇళ్లకు పంపుతామన్నారు. విద్యార్థులు ఆరోగ్యం కుదుటపడే వరకు పాఠశాల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ప్రతిరోజు చేపట్టాలని ఎంపిడిఒ ఉమామహేశ్వరిని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ డిడి కృష్ణవేణి పాల్గొన్నారు.

పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను సబ్‌కలెక్టర్ వైశాలి పరామర్శించారు. విద్యార్థులను ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వీరికి అందిస్తున్న వైద్యంపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.

604 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

స్థానిక ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 611 మంది విద్యార్థులకు గాను శనివారం నాటికి 604 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఇంకా 7 గురు విద్యార్థులు పరీక్షలు చేయాల్సి ఉందని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. పచ్చకామెర్ల లక్షణాలు తీవ్రంగా ఉన్న 23 మంది విద్యార్థులు విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులకు, పాఠశాల సిబ్బందికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఎవరికైనా పచ్చకామర్ల లక్షణాలు తీవ్రంగా ఉంటే అటువంటి వారందరికి మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్ వైశాలి

గురుకుల పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ గౌతమి

ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ ప్రభాకరరెడ్డి; సాలూరులో ఆటో డ్రైవర్లతో ర్యాలీ ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

హామీలన్నీ అమలు చేశాం

- 5217 మందికి రూ.7.82కోట్లు జమ
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి , జిల్లా ఇంచార్జ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రవాణా శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి జూనియర్ కళాశాల మైదానం వరకు ఆటోలతో ర్యాలీగా చేరుకున్నారు. ఎమ్మెల్యే విజయ్‌చంద్ర, మంత్రి అచ్చెన్నాయుడు ఆటో నడుపుతూ సభా స్థలికి చేరారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లే టిడిపి ప్రచారకర్తలని అన్నారు. ఈ క్రమంలో డ్రైవర్ల సంక్షేమం కోసం ఆటో డ్రైవర్ సేవలో పథకానికి శ్రీకారం చుట్టామని, సొంత ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఆర్థికంగా అండగా నిలబడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకం రూపొందించిం దన్నారు.జిల్లాలో 5217 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.7 కోట్ల 82 లక్షల 55 వేల రూపాయలను జమచేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వైశాలి, ఎఎంసి చైర్మన్ గొట్టాపు గౌరీ, ఎఎంసి వైస్ చైర్మన్ రౌతు వేణు, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, టిడిపి నాయకులు బర్నాల సీతారాం, గుంట్రెడ్డి రవికుమార్, మజ్జి వెంకటేష్, పలువురు కౌన్సిలర్లు, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఆటో డ్రైవర్లు పలువురు ఉన్నారు.

కురుపాం : ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపేట వేస్తుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఆటో డ్రైవర్ల సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా దూళికేశ్వర ఆలయం నుంచి ఆటోలతో ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 1347 మంది ఆటో డ్రైవర్లకు గానూ రూ.2 కోట్ల 20 లక్షల 5000 రూపాయలు అందజేశామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దిలీప్ చక్రవర్తి, ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ, డిపిఒ టి.కొండలరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్తికేయ నాయక్, ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, ఎస్‌టి కమిషన్ మెంబర్ కడ్రక మల్లేష్, కూటమి నాయకులు కోలా రంజిత్ కుమార్, కె.కొండయ్య, బొంగు సురేష్, దత్తి లక్ష్మణరావు, ఐదు మండలాల కన్వీనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

సాలూరు: ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి డిగ్రీ కాలేజీ వరకు ఆటో ర్యాలీని రాష్ట్ర గిరిజనశాఖా మంత్రి జి.సంధ్యారాణి నిర్వహించారు. అనంతరం ఆమె ఆటో కార్మికులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆటో మ్యాక్సీ కార్మికునికి ఇబ్బందులు కలగకుండా వారి సంక్షేమాన్ని ఆకాంక్షించి ప్రభుత్వం ఒక్కొక్క కార్మికునికి రూ.15వేలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రామచంద్రరావు, మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

పాలకొండ :ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం స్థానిక కోటదుర్గమ్మ అమ్మవారి గుడి నుంచి సీతంపేట వరకు శనివారం జరిగిన ఆటో ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తానే స్వయంగా నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ పథకాన్ని ఆటో డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నల్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ పడాల భూదేవి, మండల, పట్టణ టిడిపి అధ్యక్షులు గండి రామి నాయుడు గంట సంతోష్ కుమార్ తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు తదితరులు ఉన్నారు.

సీతానగరం : మండలంలోని 419 మంది ఆటో వాహన మిత్రు కోసం ఆన్లైన్‌లో దరఖాస్తులు వచ్చాయని అందులో 413 మంది పథకానికి అర్హులని మంజూరు మంజూరయ్యవని మండల పరిషత్ సిబ్బంది జూనియర్ అసిస్టెంట్ రామనాయుడు తెలిపారు. శనివారం ఆటో వాహన మిత్ర పార్వతీపురం జరిగే ర్యాలీకి స్థానిక మండల పరిషత్ నుండి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఇందులో తెలుగుదేశం నాయకులు మండల పార్టీ అధ్యక్షులు కార్యదర్శులు పెంట సత్యనారాయణ, రౌతు వేణుగోపాల్ నాయుడు, యోగి రెడ్డి గోపాల గోపాలరావు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఐటిడిఎ పిఒ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్, పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి అన్నారు. స్థానిక ఐటిడిఎలోని ఎస్ఆర్ శంకరన్ మీటింగ్ హాల్లో ఆటో డ్రైవర్ల సేవా పథకం ప్రారంభ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పాలకొండ నియోజకవర్గంలోని 1251 మంది లబ్ధిదారులకు రూ.1,87,65,000 చెక్కును ఆటోడ్రైవర్లకు అందించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సవర తోటమొఖలింగం, రాష్ట్ర డైరెక్టర్ నిమ్మల నిబ్రం, టిఎసి సభ్యులు సవర మాలయ్య, మండల జనసేన అధ్యక్షులు మండంగి విశ్వనాథం, ఐటిడిఎ ఎఒ వి.సునీల్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాలరావు, పశు సంవర్ధక శాఖ జేడి మన్మధరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి గిరిజన సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, కెజిబివి పాఠశాలలు, మోడల్ స్కూల్స్, జిల్లా పరిషత్ స్కూల్స్ లకు సంబందించిన ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాల, వసతి గృహాల్లో తాగు నీటి సమస్యల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా తాగు నీటి సమస్య ఉంటే వెంటనే ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విద్యార్థులను గురించి వారిని వెంటనే స్థానికంగా ఉన్న పిహెచ్‌సి, సిహెచ్‌సిలకు పంపించాలని అధికారులని కలెక్టర్ ఆదేశించారు. వైద్య పరీక్షల అనంతరం వైద్యుల సర్టిఫికెట్ మంజూరు చేస్తేనే పాఠశాలకు గాని, వసతి గృహానికి రావాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి పాఠశాల, వసతి గృహల్లో సిక్ రూంలను కేటాయిం చాలన్నారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మరుగుదొడ్లు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాల, వసతి గృహాల్లో పారిశుధ్యంపై ప్రధానోపాధ్యా యులు ప్రత్యేక దృష్టి పెట్టి, నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగు నీరు, నీళ్ల ట్యాంక్‌లను ప్రతి రోజు పరిశీలించాలని, తాగు నీటిలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తక్షణమే వాటిని శుభ్రపరచాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా వంట గదిలో పాత్రలు, వంటిల్లు శుభ్రంగా ఉండాలని, అపరిశుభ్రంగా ఉండకూడదని కలెక్టర్ పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలున్న విద్యార్థులను వెంటనే ఆసుపత్రికి పంపించి వైద్యం చేయించాలని ఎక్కడా ఎటువంటి పొరబాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

ఇటీవల కాలంలో భారీ వర్షాలు, ఈదురు గాలులకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని పట్టుచెన్నారు పంచాయతీ డొంకల వెలగవలసలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ అకాల వర్షాలకు మండలంలో అరటి, మొక్క జొన్న, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. చేతికొచ్చిన పంట నీటి పాలైందన్నారు. పంట నష్టాలను సమగ్రంగా ఉద్యాన, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వేలు చేసి నష్టపోయిన ప్రతి రైతును గుర్తించాలన్నారు. పాక్షిక నష్టం జరిగితే ఎకరాకు రూ.25వేలు, పూర్తిగా నష్టం జరిగితే రూ.50 వేలు తక్షణం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. మండలంలో 270 ఎకరాలు మాత్రమే నష్టం జరిగిందని అంచనా వేశారని, ఇవి తప్పుడు అంచనాలను ఇస్తున్నారని, పూర్తిగా ప్రతి రైతుకు సంబందించిన ప్రతి పంటను పక్కాగా అంచనాలు తయారు చేసి సమగ్ర నివేదికలను ఉన్నతాదికారులకు సమర్పించి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు ఎన్ వై నాయుడు, మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు సీదరపు అప్పారావు, రైతులు చెడ్డ లచ్చన్న, సీతారాం, వెంకట్రావు,పండు తదితరులు పాల్గొన్నారు.

వెంటవలసలో నేలకొరిగిన అరటిపంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కందులపదంలో నేలకొరిగిన అరటి పంటను పరిశీలిస్తున్న రాజన్నదొర

పంట పొలాలను పరిశీలించిన రాజన్నదొర

అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకొని వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేసిన మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తోణాం, కందులపదం గ్రామాల్లో నష్టం జరిగిన ప్రాంతాల్లో రైతులతో కలిసి పంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతికి అంది వచ్చిన పంట ప్రతి నష్టం జరగడం దారుణమన్నారు. కూటమి పభుత్వ హయాంలో కనీసం ఎరువులు కూడా సక్రమంగా సరఫరా చేయకపోవడం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఎటువంటి ఇబ్బందులు అన్ని లేకుండా ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు పంటకు సరైన నష్టపరిహారం చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, మండల వైసిపి అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, మువ్వల ఆదయ్య, వైసిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుల సమ్మెతో అందని వైద్య సేవలు

ఆసుపత్రులకే పరిమితమైన 104 వాహనాలు

ప్రజాశక్తి - కొమరాడ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మెతో గ్రామాల్లో వైద్య సేవలు అందడం లేదు. మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు విధులకు హాజరు కాకపోవడంతో ఆసుపత్రులకు వచ్చే రోగులతో పాటు గ్రామాల్లో ఉన్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో వివిధ ప్రాంతాల నుంచి ఔట్సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులను ఒక్కొక్క ఆసుపత్రికి ప్రభుత్వం కేటాయించి తాత్కాలిక వైద్య సేవలు అందిస్తుంది. దీంతోపాటు గ్రామాల్లో ప్రతిరోజు ఏదో గ్రామంలో 104 ద్వారా వైద్యశాల అందించే విషయంలో గ్రామస్తులకు వైద్య సేవలందడం లేదు. ఒక ఆసుపత్రికి ఇద్దరు వైద్యాధికారులు ఉంటే ఒకరు ఆసుపత్రిలో వైద్య సేవలందించగా మరొకరు 104 ద్వారా గ్రామంలోకి వెళ్లి వైద్య సేవలు అందించేవారు. ఆసుపత్రికి మాత్రమే తాత్కాలికంగా వైద్యులను ప్రభుత్వం అందుబాటులో ఉంచినప్పటికీ గ్రామాల్లో వైద్యసేవందించేందుకు వైద్యులు లేకపోవడంతో 104 వాహనాలు ఆసుపత్రికే పరిమితమయ్యాయి. దీంతో గ్రామాల్లోని వివిధ రోగాల బారిన పడుతున్న ప్రజలకు వైద్య సేవలందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వైద్య అధికారుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టి ప్రజలకు సకాలంలో అన్ని వైద్యశాల అందించేలా ప్రజలు కోరుతున్నారు.

వైద్యాధికారుల సమ్మెతో ఆసుపత్రికే పరిమితమైన 104 వాహనం

అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం దేవలంపేట సెంటర్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. దీనికి నిరసనగా పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఇలాంటి సంఘటన జరగడం దారుణమన్నారు. ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన వ్యక్తుల్లో అగ్రగనుడైన రాజ్యాంగ నిర్మాత, పేదల పెన్నిధి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానించడం కుల దురహంకారం చేసే ప్రయత్నమేనని అన్నారు. తక్షణమే దుండగులను అరెస్టు చేసి శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో చంటి, రాఘవ, ఐడియా, జాలుమూరు గౌరీ, భువనేశ్వర్, రాజేంద్ర, చంటి, పోలీస్, రాము, తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై ప్రచారం ఎవరి కోసం?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తగ్గించిన జిఎస్‌టిపై ప్రజల్లో అవగహన కలిగించేందుకు అధికార యంత్రాంగం విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఎమ్మెల్యేలు, అధికార పార్టీలకు చెందిన నాయకులూ ఇందులో భాగస్వామ్యం అవుతున్నారు. దీనిపై మేధావి వర్గంలోనూ, క్రయ, విక్రయాలపై కాస్త అవగాహన ఉన్నవారు, ఆర్థిక నిపుణులు, వినియోగదారుల తరపున పనిచేసే సంఘాల నాయకుల నుంచి భిన్నమైన స్పందన వినిపిస్తోంది. 'ఇంతటి ముమ్మర ప్రచారం ఎవరి కోసం. నిజంగా ప్రజల ప్రయోజనాల కోసమేనా? ఈ ఆలోచన గనుక ప్రభుత్వానికి, పాలక పార్టీలకు ఉంటే, దీని అమలుపై వర్తకులు, వాణిజ్య సంస్థలతో సమావేశాలు నిర్వహించేవి. క్రయ, విక్రయాలపై దృష్టిపెట్టి అమలు చేయని వారిపై చర్యలు తీసుకునేవి. అలా కాకుండా ధరలు తగ్గాయంటూ జనంలోకి వెళ్లడం వల్ల వారికి అదనంగా ఒనగూరేదేముంది.' అంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. కాదేదీ కవితకు అనర్హం అన్నట్టుగా కాదేదీ రాజకీయాలకు అనర్హం అంటూ జిఎస్‌టి రూపంలో ప్రజలపై మోపిన భారంలో అవగింజంత తగ్గించి, తాటికాయంత రాజకీయ ప్రయోజనాలు పొందాలని ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో జిఎస్‌టి తగ్గింపుపై పండగలా ప్రచారం చేయాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. కాదు కాదు... ఈ విధమైన ఒత్తిడి ప్రభుత్వం చేస్తోంది. ఇందుకోసం విజయనగరం జిల్లాలో ఏకంగా నాలుగు వారాల షెడ్యూల్‌నే ప్రకటించారు. ఈ కార్యక్రమానికి గత నెల 22న శ్రీకారం చుట్టిన సంగతి విధితమే. గత నెల 25 నుంచి 29వరకు ఇంటింటికి వెళ్లి ధరల తగ్గాయంటూ చెప్పారు. 30వ తేదీ నుంచి వ్యవసాయం, ఇతర వృత్తిదారుల దగ్గరకు వెళ్తున్నారు. ఈ తరహా ప్రచారం ఈనెల 6వ తేదీ వరకు కొనసాగుతుందట. 7వ తేదీ నుంచి 13 వరకు విద్యారంగం, లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాల్లో ప్రచారం చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. 14నుంచి 18వ తేదీ వరకు సేవారంగంలో ముఖ్యంగా టూరిజం, రెన్యుబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్స్ తదితరాలు, 19న గొప్ప ముగింపు కార్యక్రమం చేపడతారట. కానీ, నిజంగా జిఎస్‌టి భారం తగ్గిందా? వేసిన పన్నును తగించినందుకు ప్రచారం ఎందుకు? జిఎస్‌టి భారం దేశం పుట్టికతో వచ్చింది కాదు కదా? ఒక దేశం... ఒకే పన్ను అంటూ బిజెపి అధికారంలోకి వచ్చాక మోపిన భారమే ఇది. అప్పట్లో మన జిల్లాలోనూ వ్యాపారులు, వినియోగదారులు, వాణిజ్య సంస్థలు కూడా పెద్దపెట్టున వ్యతిరేకించారు. జిల్లా కేంద్రం ధర్నాలు, నిరసన కార్యక్రమాలతో దద్దరిల్లిన సందర్భాలు, సన్నివేశాలు ఇంకా కళ్లముందు కదిలాడుతునే ఉన్నాయి. ఈ సంగతి అటుంచితే.... ధరలు పెరిగినప్పుడైమైనా పాలకులు, అధికారులు విచారం వ్యక్తం చేశారా? . దేశం, రాష్ట్రం, జిల్లా ఇంత క్లిష్టపరిస్థితుల్లో ఉంది కాబట్టి ధరలు పెంచుతున్నాం... పెంచక తప్పడం లేదు. అంటూ ఊరూర ప్రచారం చేస్తున్నారా? మరి ధరలు పెంచినప్పుడు, పెరిగినప్పుడు లేని హడావుడి, తగ్గించినప్పుడు ఎందుకు? కూటమి ప్రభుత్వంలో పెట్రోల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ధరలు రోజు రోజుకూ మారుతున్నాయి. వంటనూనె, ఇతర నిత్యవసర సరుకుల ధరలు కూడా అంతే. దీన్నిబట్టి స్వల్పంగా తగ్గించిన జిఎస్‌టి వల్ల పేదలకు ఏదో ఒరిగిపోయినట్టు భ్రమలు కల్పించేందుకు పాలకపార్టీలు ఆడుతున్న నాటకం ఇది అని సర్వత్రా విమర్శలు వ్యక్తమౌతున్నాయి. విమర్శలే కాదు... 'బతుకే భారంగావున్న మెజార్టీ ప్రజానీకం ఇటువంటి ప్రచారాన్ని ఎలా స్వీకరిస్తారు. ఎలా జీర్ణించుకుంటారు అనేది పబ్లిక్ టాక్.



ఎస్‌సి, ఎస్‌టి కేసులకు రూ.48లక్షలు నష్టపరిహారం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారం కింద 46 కేసులకు గాను రూ.48 లక్షలు నష్టపరిహారంగా చెల్లించినట్టు కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎస్సీ,ఎస్టీ అత్యాచార కేసులను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 46 కేసులకు రూ.48 లక్షలు నష్టపరిహారంగా చెల్లించగా, 15 కేసులకు రూ .14.50 లక్షలు చెల్లించాల్సి ఉందని, ఒక కేసు విచారణ కొనసాగుతుందని వివరించారు. సుమోటో క్యాస్ట్ సర్టిఫికేట్స్ పెండింగ్‌లో ఉండడానికి వీలులేదన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో లక్షా పదివేలు క్యాస్ట్ సర్టిఫికేట్లు మంజూరు చేశామన్నారు. కుటుంబంలో ఎవరైనా గతంలో కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉంటే అటువంటి విద్యార్థులకు తక్షణ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయాలన్నారు. ఎస్‌పి ఎస్‌వి మాధవ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో భూ సంబంధిత వ్యవహారాల్లో ఏర్పడిన వివాదాల కారణంగా ఎస్సీ, ఎస్టీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. వివిధ కులాల మధ్య వివాదాల్లో ఉన్నప్పటికీ ఆయా కేసుల్లో ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వ్యక్తులను భాగస్వామ్యం చేస్తున్నట్లు తెలుస్తోందని ఆయన చెప్పారు. ఇందుకు ప్రధాన కారణంగా ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం వల్ల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, ఎఎస్‌పి అంకిత సురాన, డిఎస్‌పి ఎం.రాంబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం. శ్యామల, ఇరిగేషన్ ఇఇ ఆర్.అప్పలనాయుడు, కమిటీ సభ్యులు నీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వేణు గోపాల్, కౌలు చిరంజీవులు, సామల సింహాచలం, కయనా బలరాం, బచ్చల దయానంద, జలుమూరు మణికంఠ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నిండు కుండలా తోటపల్లి బ్యారేజి

ప్రజాశక్తి- గరుగుబిల్లి

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో ఎగువన కురుస్తున్న వర్షాలకు నాగాళి నది నుంచి వచ్చిన వరదతో మండలంలో ఉల్లిభద్ర వద్ద గల తోటపల్లి జలాశయం నిండికుండలా ఉంది. ఈ జలాశయంలో శనివారం నాటికి ఎఫ్ఆర్ ఎల్ 105.00 మీటర్లు ఉందని ఇరిగేషన్ జెఇ కిశోర్ తెలిపారు. బ్యారేజి సామర్థ్యం 2.534 టిఎంసి లాగా ఉందన్నారు. రిజర్వాయర్ లెవెల్ ం 103.55 టిఎంసి ఉండగా, ఇన్‌ఫ్లో సామర్థ్యం 11637 క్యూసెక్కులు, ఎల్ఎంసి 80 క్యూసెక్కులు ఉందన్నారు. అలాగే అవుట్ ఫ్లో 10617 క్యూసెక్కులు, ఓల్డ్ ఆర్ఎంసి 70 క్యూసెక్కులు, నూతన ఆర్ఎంసి 700 క్యూసెక్కులు ఉందని, మొత్తం అవుట్ ఫ్లో 11637 క్యూసెక్కులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు గేట్లును తెరచి నీటిని విడిచిపెడుతున్నట్టు తెలిపారు. బ్యారేజ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నీట మునిగిన వరి

ప్రజాశక్తి - పాలకొండ

తుఫాన్ కారణంగా మండలంలో గత రెండురోజులు కురిసిన వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాగావళి, రావాడగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో యుపి రాజుపేట, తుమ్మరాడ, బాసూరు, అర్తలి, వెలగవాడ తదితర గ్రామాల్లోని సుమారు 3వేల ఎకరాల వరకు వరి నీటిని మునిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు శనివారం కూడా వాతావరణం అనుకూలించకపోవడంతో మబ్బులు ఉండడంతో రైతులు భయపడుతున్నారు. చేతి అందవలసినపంట నీళ్ల పోలవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

ఇటీవల కురిసిన ఈదురు గాలులు, వర్షానికి గోడ కూలి మండలంలోని ఉదయపురానికి చెందిన కుంబురుక అరవింద్ శుక్రవారం ఉదయం మృతి చెందిన సంఘటన తెలుసుకున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం రాత్రి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చి ఓదార్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో, నాయకులు విప్లవ కుమార్, యువరాజు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగును అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రకృతి వ్యవసాయ సాగును ప్రతి ఒక్క రైతు అలవర్చుకోవాలని డిపిఎం శ్రావణ్ కుమార్ నాయుడు అన్నారు. మండలంలోని గుంజరాడ, కొండ బారిడి గ్రామాల్లో శనివారం ప్రకృతి వ్యవసాయన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయను మాట్లాడుతూ వరి ప్రధాన పంటతో పాటు అదనపు ఆదాయం కూడా రావాలంటే గట్లు వెడల్పు చేసుకుని వాటి పైన బంతి, చిక్కుడు, కంది, బెండ, వంగ, బీర, మినుము, పెసర, కర్ర పెండ్లం, సీమ దుంపలు, అరటి, మునగ, బొప్పాయి, అన్ని రకాల కూరగాయలు ఆకుకూరలు, పండ్ల జాతులు సాగు చేస్తే ఎకరాకు రూ.10 వేల వరకు ఆదాయం వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.అన్న పూర్ణ, గణేష్ చంద్ర, పి.నరేష్ బాలయ్య, డిల్లేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

104 వైద్యసేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - బలిజిపేట

104 వాహనం వైద్య సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని 104 జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ అన్నారు. శనివారం పిహెచ్‌సిలో గల 104 వాహనంలో ఉన్న సామాగ్రినా తనిఖీ చేసి, అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పలు వివరాలను అడిగి వాహనం లో అన్ని రికార్డులు, మందుల లభ్యతను పరిశీలించారు. వాహనాన్ని తనిఖీ చేసి, పరిస్థితిని పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాహనం కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది ఉన్నారు.

సమస్యలపై అధికారులను నిలదీస్తున్న సభ్యుడు

సజావుగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం ఎంపిపి గుడివాడ నాగమణి అధ్యక్షతన జరిగింది. తొలుత ఎఒ శివ గణేష్ మాట్లాడుతూ మండలంలో 10 వేల ఎకరాలకు ఇ- క్రాప్ చేశామని, ఈనెల 25నాటికి మిగిలిన 10వేల ఎకరాలు పూర్తి చేస్తామని తెలిపారు. జడ్పిటిసి సభ్యులు రవికుమార్ యూరియా గూర్చి ప్రస్తావించగా మండలానికి 1450 మెట్రిక్ టన్నులు యూరియా అవసరము కాగా 1600 టన్నులు యూరియా పంపిణీ చేశామని ఎఒ చెప్పారు. ఇరిగేషన్ ఎఇ మాట్లాడుతూ అంకలాం కాలువకు రూ.17.3 లక్షలు జైకా నిధులు మంజూరు కాగా కాంట్రాక్టర్ 500 మీటర్ల వరకు లైనింగ్ కాలువ చేశారని, అతనికి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయాయని తెలిపారు. ఎపిఒ కేశవరావు మాట్లాడుతూ ఉపాధి హామీ జాబు కార్డు ఉన్న వారందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు రూ.4కోట్లుకు గానూ కోటి రూపాయలు మాత్రమే చెల్లించామన్నారు. అలాగే వైద్య, విద్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు తమ శాఖల గూర్చి వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెలిది సాయిరాం, ఎంపిడిఒ శ్రీవాణి, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న బిసి సంఘం అధ్యక్షులు రామకృష్ణ

ఎన్నికల హామీలను అమలు చేయండి

ప్రజాశక్తి - కురుపాం

2024 ఎన్నికల ముందు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బిసిలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని మన్యం జిల్లా బిసి సంఘ అధ్యక్షులు ఆవాల రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం బీసీల 5 ప్రధాన డిమాండ్లపై కలెక్టర్ ప్రభాకర్ రెడ్డికు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయను మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న బిసిలకు ఎస్సీ, ఎస్టీల వలెనే ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని ఎన్నికల వాగ్దానం చేశారని, ఏడాదిన్నర గడుస్తున్నా, ఈ ప్రభుత్వం ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదని అన్నారు. చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థలు-నామినేటెడ్ పదవులు-నామినేషన్వర్క్‌ల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు జరుపుతామని మరో వాగ్దానం చేశారని, అది కూడా అమలు చేయలేదని అన్నారు. బీసీలకు కూడా జనాభా దామాషాలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ మహేష్, యువజన అధ్యక్షుడు జగన్మోహన్, సరస్వతి గణేష్ పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలి

పాత పద్ధతిలో వేతనాలు చెల్లించాలని డిపిఒకు వినతి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పంచాయతీల్లో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, ఆ సంఘం నాయకులు పాండా, గౌరీ, చంటి డిమాండ్ చేశారు. శనివారం వారు జిల్లా పంచాయతీ అధికారి కొండలరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు మన్యం జిల్లాలో సుమారు 1000 మంది పనిచేస్తున్నారని, వీరికి గతంలో తెలుగుదేశం ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసి గ్రామాల పరిశుభ్రత కోసం నియమించారని తెలిపారు. అప్పట్లో స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా నేరుగా జీతాలు చెల్లించే వారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయితీలకు అప్పజెప్పారని తెలిపారు. ఇలా అప్ప చెప్పడం వల్ల సర్పంచులు, సెక్రెటరీలు సక్రమంగా జీతాలు చెల్లించలేదన్నారు. 15 నుంచి 18 నెలల జీతాలు పెండింగ్ ఉన్నాయని, కొన్ని పంచాయితీల్లో రూ.3వేలు ఇచ్చి పని చేయమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ అంబాసిడర్లకు ఇస్తున్న రూ.6వేలు వేతనం సక్రమంగా చెల్లించడం లేదని, అనారోగ్యాల బారిన పడుతున్నారని, వీరికి ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత లేదని చెప్పారు. ఇప్పటికైనా పెండింగ్ జీతాలు చెల్లించి స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా డైరెక్టర్ జీతాలు చెల్లించాలని కోరారు. దీనిపై డిపిఒ కొండలరావు స్పందించి మాస్కులు, గ్లౌజులు, రక్షణ పరికరాలు, సబ్బులు, గుర్తింపు కార్డులు ఇప్పించే ఏర్పాటు చేస్తామని పెండింగ్ జీతాలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చంటి, రాజేంద్ర, పద్వ్, రాఘవ, పోలీసు, నారాయణరావు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



డిపిఒకు వినతిని అందజేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, సిఐటియు నాయకులు

అధికారులెవరూ లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

అధికారులు లేక స్తంభించిన పాలన

మండల పరిషత్ కార్యాలయంలో సేవలందక అవస్థలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గల ఉన్నతాధికారులంతా వివిధ కారణాలతో లేకపోవడం వల్ల ప్రజాసేవలు స్తంభించిపోయాయి. ఎంపిడిఒగా పనిచేస్తున్న ఎంఎల్ఎన్ ప్రసాద్ సామర్లకోటలో 40 రోజులు పాటు శిక్షణ నిమిత్తంగా వెళ్లిపోయారు. ఆయన స్థానంలో ఇఒపిఆర్‌డి పనిచేస్తున్న కెకె కుమార్ వర్మ అనారోగ్యం కారణంగా సెలవు పెట్టారు. కార్యాలయ ఎఒ వెంకట్రావు కూడా సెలవు పెట్టారు. ఇక కార్యాలయ సూపరింటెండెంట్ ఎంపి పిఒగా వెళ్లిపోవడంతో కార్యాలయం అంతా ఖాళీ అయ్యిపోయింది. అలాగే మండల ఇంజనీరింగ్ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. దీంతో అన్నిశాఖలూ ఇన్‌ఛార్జి పాలనలోనే కొనసాగుతుంది. దీనికి తోడు మండలంలో 21 సచివాలయాలుండగా అందులో ఎక్కువ సచివాలయం నుంచి వివిధ శాఖలకు చెందిన సచివాలయ సిబ్బందిని డిప్యూటేషన్ పేరుతో జిల్లా కేంద్రానికి పంపించడంతో గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పరిపాలన స్తంభిస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అంతేకాక అధికారులు ఎవరూ లేకపోవడంతో 34మంది పంచాయతీ కార్యదర్శులకు, 10మంది మండల స్థాయి సిబ్బందికి అక్టోబర్ నెల జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా సమస్య వస్తే చెప్పుదుమంటే ఏ అధికారీ లేకపోవడంతో గ్రామాలకు తిరిగి వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు మండల పరిపాలనపై దృష్టి పెట్టేందుకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మొండెంఖల్ లో శరవేగంగా పారిశుధ్య పనులు

కురుపాం : మండలంలోని మొండెంఖల్‌లో సర్పంచ్ ఐ.గౌరీ శంకర్ ఆధ్వర్యంలో శనివారం శరవేగంగా పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో పోస్టాఫీస్ వీధి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వీధుల్లో డ్రైనేజీ, చెత్తాచెదారంతో నిండి ఉండడంతో పూడికలు తీసి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తూ ప్రజలకు తాగునీరు, పారిశుధ్య లోపం లేకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇంకా ఎక్కడైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామ న్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో పోరుబాటను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

చలో విజయవాడలో ఈనెల 7న ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ఫ్యాప్టో పోరుబాటను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు శనివారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 2004 సెప్టెంబర్ 1కు ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయులకు బోధనేతర పనుల్లేకుండా చూడాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, సీఆర్పీ వేతనాలు పెంచాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించి విద్యాశాఖలో ఉన్న అసంబంధితను తొలగించాలని, జిఒ 72, 73, 74 అమలు చేయాలని, పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని, తదితర అంశాలతో కూడిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎం.పైడిరాజు, ఎం.మురళి, ఆర్.ధనుంజయ నాయుడు, బి.దుర్గాప్రసాద్, ఎ.సూర్యనారాయణ, ఎం.నరహరి, వి.అన్నాజీ రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

బాలల సంరక్షణ, సంక్షేమంపై శిక్షణ

ప్రజాశక్తి - భామిని

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భామిని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మండల స్థాయి బాలల పరిరక్షణ, సంక్షేమంపై గ్రామ స్థాయి కమిటీలకు శిక్షణా కార్యక్రమం సిడిపిఒ జి.శాంతి భవాని ఆధ్వర్యాన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి అధికారులంతా పిల్లల రక్షణ, సంరక్షణ విషయంలో కమిటీ విధులు, బాధ్యతలు నిర్వర్తించాలని, లైన్ డిపార్ట్మెంట్‌లో ఉన్న అధికారులంతా సమన్వయంతో పిల్లలను పరిరక్షించాలని తెలిపారు. మన్యం జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో పిల్లల రక్షణ, సంక్షేమ కమిటీలన్నీ సక్రమంగా బాధ్యతలు, విధులు నిర్వహించాలని, కమిటీ సభ్యులంతా సమన్వయంతో పిల్లల రక్షణకై పాటుపడాలని అన్నారు. అలాగే బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తేనే వాటిని నివారించగలుగుతామన్నారు. లీగల్ ఆఫీసర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ బాలబాలికులకు (ఫోక్సో చట్టం గూర్చి అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని, లైంగిక దాడులు జరిగితే ఎలాంటి వ్యక్తి అయినా శిక్షా అర్హుడు అవుతాడని అన్నారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.అరసవిల్లి నాయుడు మాట్లాడుతూ గ్రామ బాలల కమిటీ సభ్యుల విధులు, బాధ్యతలు గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, వీఆర్వోలు, సెక్రటరీలు, సచివాలయం మహిళా సంరక్షణ అధికారులు,ఎఎన్ఎం, విఒలు, సూపర్వైజర్లు ఔట్ ఇచ్ వర్కర్ హరికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థినుల మరణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి-సాలూరు

కురుపాం ఎపి గిరిజన విద్యార్థినుల గురుకుల పాఠశాలలో విద్యార్థినుల మరణాలు, 85మందికి పచ్చకామెర్ల వచ్చిన నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. మృతి చెందిన కుటుంబాలను ఆదుకునేందుకు 4వ తరగతి ఉద్యోగ నియమకాలు చేపట్టాలని కోరారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాయంలో గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు విలేకర్లతో మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గిరిజన సంక్షేమ హాస్టల్లో ఎఎన్ఎం నియమకాలు చేపడతామంటూ మంత్రి సంధ్యారాణి తొలి సంతకం చేశారని, ఆ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు మరణాలు పెరుగుతున్నాయని. ఇటీవల కాలంలో కురుపాం గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు అకాల మరణం చెందారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆశ్రమ పాఠశాలలో వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థినుల అనారోగ్య సమస్యపై సమగ్ర దర్యాప్తు చేసి రోగాలకు కారణాలను వెతికి పరిష్కారం చూపాలని కోరారు. లేనియెడల ఆందోళన పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి గెమ్మెల జానకిరావు, నాయకులు చింత జోగయ్య, సీదరపుసుందరరావు, మెల్లిక అయోధ్య పాల్గొన్నారు.

కోతకు గురైన గుంప ఆలయం రోడ్డు

కొమరాడ : ల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా విస్తారగా వర్షాలు పడ్డాయి. ఈ నేపథ్యంలో నాగావళి నది ఉగ్ర రూపం దాల్చి ఉధృతంగా ప్రవహించింది. దీంతో కోటిపాం కాలనీ నుంచి గుంప సోమేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారి మొత్తం వరద ఉధృతికి కోతకు గురైంది. ఇప్పటికే ఆ రహదారికి మంజూరై సగం పనులు కూడా అధికారులు పూర్తి చేశారు. నది ఉధృతంగా ప్రవహించి దారి పైనుంచి వరద పారడంతో ఆ రోడ్డు మొత్తం కోతకు గురై రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. ఆలయం మొత్తం ముంపునకు గురవ్వడంతో లోపల విద్యుత్ సామాగ్రితో పాటు ఆలయం పూర్తిగా పాడైపోయింది. దీంతో నదీ ప్రవాహం తగ్గినప్పటికీ ఆలయం వద్దకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో పూజలకు కూడా నోచుకోని పరిస్థితి ఏర్పడింది. ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి భద్రత గోడ లేకపోవడంతో కోతకు గురై ప్రతి ఏటా కొద్ది కొద్దిగా ఆలయం పరిసర ప్రాం తాలు ఒడ్డులు కొట్టుకుపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధలు స్పందించి ఆలయం చుట్టూ రక్షణ గోడ ఏర్పాటు చేసి ఆలయం కూలిపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'అభివృద్ధికి మీ సహకారం అవసరం'

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాభివృద్ధికి మీ సహకారం ఎంతో అవసరమని మాజీ సర్పంచి, పట్టణ టిడిపి అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ చట్టం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో ఉపాధి హామీ చట్టం ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులు గూర్చి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామంలో 938 జాబ్ కార్డులున్నాయని, అవసరమైన వారికి జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పించాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు చేసేలా చూడాలన్నారు. గ్రామాభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, మేజర్ పంచాయతీ ఇఒ బి కోటేశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మమ అనిపించిన గ్రామసభ

గ్రామంలో చేపట్టనున్న ఉపాధి పనుల గురించి వేతనదారులకు ఉపాధి పనులపై అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు ఏర్పాటు చేశారు. అయితే వేతనదారులకు ఈ సమాచారాన్ని అందించకపోవడంతో వారెవరూ హాజరు కాలేదు. సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీ కార్యకర్తలతో గ్రామ సభ నిర్వహించి మమ అనిపించారు.

రోడ్డు బాగు చేసుకున్న గిరిజనులు

ప్రజాశక్తి - మక్కువ

మక్కువ పంచాయతీ పరిధిలో గల అంటివలస గిరిజనులు కొన్నేళ్లుగా రహదారి లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వీరికి రహదారి కష్టాలు తప్పడం లేదు. మండల కేంద్రం కూత వేటు దూరంలో ఉన్నప్పటికీ శంబరకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి గ్రామానికి కొద్ది దూరమే అయినా అధికారులెవరూ పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. దీంతో స్థానిక టిడిపి సీనియర్ నేత మావుడి ప్రసాదరావునాయుడు రోడ్డు గోతులకు అవసరమైన వెట్ మిక్స్ అందించడంతో గ్రామస్తులంతా శనివారం శ్రమదానం చేసి బాగు చేసుకున్నారు. ప్రజాప్రతినిధుల హామీ ఇచ్చినా, మేజర్ పంచాయతీ సర్పంచ్ తమ గ్రామంలోనే ఉన్నప్పటికీ కనీసం రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదని గిరిజనులు వాపోతున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బిటి రోడ్డు మంజూరు చేయాలని వారంతా కోరుతున్నారు.

రోడ్డును బాగు చేసుకుంటున్న గిరిజనులు

వాతావరణం మార్పు- ప్రభావాలపై రైతులకు శిక్షణ

ప్ర.జాశక్తి - సీతంపేట

మండలంలోని పూతికవలస పంచాయతీ తుంబలిలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో వాతావరణం మార్పు -ప్రభావాలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రీసోర్స్ పర్సన్ పాలక నాగేశ్వరావు గ్రీన్ హౌస్ అంటే ఏమిటి? దాని ఉపయోగాలు, వాతావరణం మార్పు వల్ల కలిగే ప్రభావాలు కోసం, అడవి పెంచడం వల్ల కలిగే లాభాలు, అడవిలో దుంపలు, ఆకుకూరలు, మందులు ఉపయోగాల గురించి వివరించారు. చిరుధాన్యాలు కొర్ర, సామ, రాగులు ఉపయోగాలు తెలిపారు. పంట దిగుబడి పెంచేందుకు మెలుకువ్వలు, జీడీ ప్రునింగ్ వల్ల ఉపయోగాలు వివరించారు. వరి లైన్ షోయింగ్ వాటి, పురుగు మందులు బదులుగా నీమస్త్రం, జిల్లేడు ద్రావణం, పంచపత్ర కాషాయం, వేప నూనె ఉపయోగించాలని, రసాయనిక మందులు బదులుగా ఘనజీవామృతం, ద్రావజీవామృతం, గోకృపామృతం ఉపయోగించి మంచి పంటను పొంది ఆరోగ్యం పెంచుకోవాలని చెప్పారు. ఈ శిక్షణకు తుంబలి, తుంబలిగూడ, తుంబలినడిమిగూడ గ్రామాల నుంచి 48మంది రైతులు పాల్గొన్నారు. వెలుగు అసోసియేషన్ కో-ఆర్డినేటర్ ఆనంద్, మొబలైజర్ బి.రామయ్య, కామేశ్వరరావు, వెలుగు సంస్థ కార్యకర్తలు మజ్జయ్య, ఎ.రామారావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి అధికారుల నిర్లక్ష్యం వీడాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులకు బస్సు సౌకర్యం కల్పించే విషయంలో ఆర్‌టిసి అధికారులు నిర్లక్ష్యం వీడాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించి వారి రవాణా సేవలు అందించాలని కలెక్టర్ గ్రీవెన్స్ కార్యక్రమంలో వినతిపత్రం అందజేస్తే దానికి సమాధానంగా కొత్త బస్సులు వస్తే అప్పుడు ఆ దారుల్లో బస్సులో నడుపుతామని ఆర్టీసీ అధికారులు చెప్పడం దారుణమని అన్నారు. ఐదు పంచాయతీలకు సంబంధించి 40 పైగా గిరిజన గ్రామాలకు గతంలో ఉన్న బస్సు సర్వీసులను తొలగించరన్నారు. ఈ గ్రామాలకు బస్సు సర్వీసులు నడపాలని ఇప్పటికి 14సార్లు కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో కోరామన్నారు. పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా లంజి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి గిరిజనులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేకపోతే గిరిజనులతో కలిసి భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు.

గిరిజన విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

గిరిజన విద్యార్థుల మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే నని సిపిఐ నాయకులు అన్నారు. శనివారం స్థానిక జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను కలసి వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వి ఎస్ కుమార్ మాట్లాడుతూ కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని విమర్శించారు. సుమారుగా 85 మంది విద్యార్థులు హాస్పటల్లో చికిత్స పొందుతున్నారంటే దీనికి నిర్లక్ష్యం ఎవరిని ప్రశ్నించారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు హరి, వికాస్, చరణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఉదాసీనతే విద్యార్థుల మరణాలు : కాంగ్రెస్

గుమ్మలక్ష్మీపురం : అధికారుల ఉదాసీనత, వసతి గృహ నిర్వాహకుల నిర్లక్ష్యమే విద్యార్థుల మరణాలకు కారణమని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు అన్నారు. ఐటిడిఎ పిఒ, డిడి వంటి ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ఎటిడబ్ల్యూఒ వంటి కింది స్థాయి అధికారుల సమగ్ర పర్యవేక్షణ లోపం వెరసి పూర్తిస్థాయి ఉద్యోగులుగా కాకుండా డిప్యూటీ వసతి గృహ నిర్వాహకుల పేరిట నియామకాలు చేపట్టి బాధ్యతలు అప్పగించడమే ఇందుకు కారణమన్నారు. ఇప్పటికైనా సవతి తల్లి ప్రేమను విడిచిపెట్టి, ప్రస్తుత కూటమి ప్రభుత్వం, ప్రత్యేకంగా గిరిజన సంక్షేమ శాఖలు శాశ్వత నివారణ చర్యలకు ఉపక్రమించాలని చిన్నారావు డిమాండ్ చేశారు.

క్వారీ పేలుళ్లతో ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల్లో భాగంగా క్వారీ పేలుళ్లలో బండ రాళ్లు తగిలి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై వెంకట సురేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం గ్రీన్ ఫీల్డ్ హైవే కెఎం స్టోన్ బంగారు గుడ్డు వద్ద రోడ్డు పనుల్లో భాగంగా కంపెనీ బండ రాళ్లను తొలగించే క్రమంలో పేలుడు పదార్థాలు వినియోగించారు. రాళ్లను పేల్చడంతో ఇద్దరు వ్యక్తులు నడుచుకుంటూ వెళ్తుండగా, వారికి రాళ్లు తగలగా కేశవ్ కుమార్ అక్కడికక్కడే మరణించాడు. మరో వ్యక్తి సూరజ్ కుమార్‌కు బలమైన గాయాలవ్వడంతో విజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సదరు ఇద్దరు వ్యక్తులు బీహార్‌కు చెందిన వ్యక్తులు. వీరు కాంట్రాక్టర్ వద్ద కూలి పని చేస్తున్నట్లుగా తెలిపారు. ఇలా బండరాళ్లను పేల్చే క్రమంలో సరైన భద్రత పాటించనందున ఒక వ్యక్తి మరణానికి కారణం అవడం, మరో వ్యక్తికి బలమైన గాయాలకు కారణమైంది. బాధితుల కుటుంబ సభ్యులు అందుబాటులో లేనందున విఆర్ఒ ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై వెంకట్ సురేష్ తెలిపారు.



బండరాళ్ల మధ్య నలిగిపోయిన కేశవ్‌కుమార్

రోజుకు రూ.600 ఉపాధి కూలీ ఇవ్వాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉపాధి పనుల కూలీలకు ప్రభుత్వం రోజుకు రూ.600 చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు మండంగి సన్యాసిరావు డిమాండ్ చేశారు. మండలంలోని లుంబేసు గ్రామ సచివాలయంలో గ్రామసభను శనివారం నిర్వహించారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రంగా అమలు చేయాలని, పని దినాలు 200 రోజులు కల్పించాలని, పనిచేసే కూలీలకు పారా, గుణపాం, తట్టే పరికారాలు ప్రభుత్వమే సరఫరా చేయాలని అన్నారు. పనిచేసే కూలీలకు డబ్బులు 14 రోజుల్లోనే చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో తాడికొండ ఎంపిటిసి మండంగి గౌరమ్మ ఉన్నారు.

పసుకుడి వద్ద బియ్యం లారీ బోల్తా

ప్రజాశక్తి -భామిని

మండలంలోని పసుకుడి గ్రామ ప్రధాన రహదారి మలుపు వద్ద శుక్రవారం రాత్రి బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ బియ్యంలోడు రాయపూర్ నుండి విశాఖపట్నం వెళ్తుంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ ఎటువంటి గాయాలు లేకుండా బయటపడ్డాడు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

వీరఘట్టం : పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గంగంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని పరిశుభ్రమైన వాతావరణంలో పాఠశాల నడిచేలా చూడాలన్నారు. అలాగే విద్యార్థులు ఆరోగ్యం, తాగునీరు, వంటగది, డైనింగ్ హాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.భాస్కరరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

వీధి కుక్కల నివారణ చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట పంచాయతీల్లో గుంపు గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రాజమండ్రి నుంచి వచ్చిన బృందం గుంపు గుంపులుగా తిరుగుతున్న కుక్కలను పట్టుకొని వేరే చోటకు తరలించారు. తరచూ కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని, ఎక్కడికి వెళ్లాలన్న భయం భయంగా ఉండేదని ఇటువంటి తరుణంలో అధికారులు కుక్కల నివారణకు చర్యలు చేపట్టడంతో ప్రజల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచులు బొత్తాడ గౌరీ శంకర్రావు, ఆర్ చైతన్య స్రవంతి ఉన్నారు.